


ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 8 సంచిక : 9 పుష్పం : 22-24 20-01-2003

RAMANA BHASKARA

TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE

PAGES : 24

VOL : 8 ISSUE : 9

EDITOR
**P.S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

SUBSCRIPTION
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**



ADDRESS
RAMANA BHASKARA
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S. RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 224589, 224689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 222438, 221260


## అసలు 'మనస్సు' అంటే ఏమిటి?

ప్రతి ఒక్కరు మనశ్శాంతికై అన్వేషిస్తూ, ఆలోచనాభారము నుండి విడుదల కోరుకుంటాము. మనస్సుకు ప్రశాంతత లేదని, తలంపుల దాడి ఏకాగ్రతను భగ్నంచేస్తున్నాయని మనము ఫిర్యాదు చేస్తూఉంటాము. అసలు మనస్సు అనగా ఏమిటో, దాని స్వరూపం మనకు అవగాహన కానంతకాలం మనస్సుపై అదుపు సాధించాలనే ప్రయత్నం సమస్యగానే మిగిలిపోతుంది.

మనస్సుకు ఒక ప్రత్యేకమైన ఉనికి ఉందని భావించడమే ప్రాధమికంగా మనము చేసే పొరపాటు. వాస్తవముగా మనస్సు అనగా 'నేను'-అను ప్రధమతలంపును ఆశ్రయించుకొనియున్న అనేక తలంపుల సముదాయము. ఎన్నితలంపులున్నా 'నేను'-అను మూలతలంపును ఆశ్రయించే ఉంటాయి. ఒకానొక క్షణంలో వ్యక్తిగతముగా ఒకతలంపుపై మనము చూపే శ్రద్ధపైనే తలంపు స్థితి ఆధారపడిఉంటుంది. వ్యకిగత శ్రద్ధను తలంపునుండి ఉపసంహరిస్తే, ఆతలంపు పడిపోయి నిర్వీర్యమౌతుంది. 'నేను-నేను' అనునది అహంస్ఫురణ. అదే చైతన్యము. 'నేను-ఫలానా', 'నేను-ఇది', 'నేను-అది' అనేది వ్యక్తిభావన. అదియే చిజ్జడగ్రంధి. అనగా కేవల ఉనికిని, జడమైన దేహాన్ని కలిపే గ్రంధి. చిజ్జడగ్రంధి భావనా మాత్రము.

కుక్క వాసనను పసికట్టి తన యజమానిని ఎలా చేరుతుందో, అదేవిధంగా మూల తలంపును దానిమూలంలోనికి ఉపసంహరించుట ద్వారా మనోమూలమును చేరవచ్చును. మూలతలంపే మనస్సు. అసలు మనస్సంటే ఏమిటని విచారణ మొదలు పెట్టినప్పుడు క్రమముగా మనస్సు ఆత్మాకారము చెంది, చివరకు మనస్సనదే లేదని తేలుతుంది. రూపములనుండి పుట్టి, రూపములలో ప్రేళ్ళూని, రూపములే మేతగాగల అహంకారానికి అసలు రూపమే లేదు. భగవాన్ శ్రీరమణులను ఎవరైనా నా మనస్సుబాగాలేదు దానిని నశింపజేయ్యండి అని అడిగినప్పుడు ఏదీ నీ మనస్సును నాకొకసారి చూపెట్టు అనేవారు. నామం, రూపం లేని అహంకారం (మనస్సు) విచారణవల్ల అదృశ్యమౌతుంది. అనేక తలంపులకు మూలం నేను అను మూలతలంపు; మూలతలంపుకు మూలం చైతన్యం (బ్రహ్మము). 'మూలతలంపు' మూలంలోనే బ్రహ్మము స్వరూపంగా ఉంది. స్వరూపంగాఉన్న బ్రహ్మమును 'నేను'గా 'తాను'గా అనుభవంలోనికి తెచ్చుకొనుటయే మన జీవితగమ్యం.

– చావలి సూర్యనారాయణమూర్తి
టీచర్, అమలాపురం

ఈ సంచికలో...... సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు


19-12-02 పాలకొల్లు ........ 3
21-12-02 జిన్నూరు ........ 10
29-12-02 పూలపల్లి ........ 17



Visit us @ www.srinannagaru.com

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 19-12-02, పాలకొల్లు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనంచేసే యోగాభ్యాసాలకంటే భగవంతుడిపట్ల విశ్వాసం ముఖ్యం. భగవంతుడి పట్ల విశ్వాసం నిజమైతే అక్కరలేనితలంపులు ఆగిపోతాయి. భగవంతుడి యందుభక్తి లేకపోవటంవలన ఇతరతలంపులు వస్తాయి. భక్తిని విడిచిపెట్టవద్దు, భక్తిని జాగ్రత్తగా కాపాడుకోండి. భక్తిలేనివారు కూడా భక్తి నేర్చుకోవటంమంచిది. ఎందుచేతనంటే భక్తివలన శారీరకఆరోగ్యం, మానసికఆరోగ్యం బాగుపడుతుంది. సమస్యలు లేకుండా సంసారం ఉండదు. ఈ సమస్యలవలన కొంత శారీరకఆరోగ్యం, మానసికఆరోగ్యం దెబ్బతింటుంది. మోక్షంమాట అటుంచండి ముందు శారీరకఆరోగ్యం, మానసిక ఆరోగ్యం కోసం భక్తిని నేర్చుకోవాలి. మీకు ఏదైనా కష్టం వచ్చింది అనుకోండి, ఆ కష్టాన్ని భరించటం నేర్చుకొంటే అప్పుడు ఈశ్వరుని దయ మీకు కలుగుతుంది. మనం మాటలు జాగ్రత్తగా మాట్లాడాలి. కొంతమంది కంగారు మాటలు మాట్లాడతారు తరువాత పశ్చాత్తాప పడతారు. మన శక్తిని ఆధ్యాత్మికఅభివృద్ధికి ఉపయోగించుకోవాలి, ఆధ్యాత్మికఅభివృద్ధికి ఉపయోగించు కోకపోతే మనకు పునర్జన్మను తీసుకొని వచ్చే వాసనలనుండి విడుదలపొందలేము. ఎక్కువ అప్పు చేసారు అనుకోండి వచ్చే ఆదాయం అంతా వడ్డీ తీర్చటానికే సరిపోతుంది. అలాగే మనం ఏదో సాధనచేసి అనవసరమైన మాటలు, తలంపులతో శక్తిని వృధా చేసుకొంటున్నాము. నియమాలన్నింటిలో ఆహారనియమము ఉత్తమమైనది అని భగవాన్ చెప్పారు. మితంగా తినమని చెప్పారు, యుక్తంగాతినమని చెప్పారు. మితంగా తినటంకాదు, యుక్తంగా తినటంకాదు, తెలివిగా తినమని కొంతమంది చెపుతున్నారు. మీకు సమస్యలు వచ్చినప్పుడు మీ తలకాయ అక్కడపెట్టి ఎలా జాగ్రత్తగా ఆలోచించుకొంటారో అలాగ అన్నంతినేటప్పుడు అంతతెలివిగా తింటే, అంత జాగ్రత్తగా ఉంటే మీ మనస్సు నిలబడుతుంది. ఒకడు రైల్వేస్టేషన్‌లో కూర్చొన్నాడు. ఏమిటి చాలా సేపటినుండి ఇక్కడే కూర్చొన్నావు అని అడిగితే పట్టాలుదాటి రెండోప్రక్కకు వెళ్ళాలి, రైళ్ళు అన్నీ వెళ్ళిపోయాక వెళతాను అన్నాడట. 24 గంటలు రైళ్ళు అటుఇటు వెళుతూనే ఉంటే ఇంక ఆ ప్రక్కకు ఎలా వెళ్ళగలడు. అలాగే జీవితం పొడుగునా ప్రతీ కుటుంబంలోనూ ఏవో సమస్యలు వస్తూనే ఉంటాయి. ఈ సమస్యలు అన్నీ అయిపోయిన తరువాత సాధనచేద్దాము, భక్తిని అభివృద్ధి చేసుకొందాము అంటే రైళ్ళు అన్నీ వెళ్ళిపోయిన తరువాత పట్టాలు దాటుతాను అనేవాడు ఎటువంటివాడో మీరు కూడా అంతే. మనిషికి వచ్చే చాలా వికారాలు కామక్రోధములనుండి వస్తాయి. మనపెద్దలు పూజ ఎందుకు పెట్టారు అంటే మీరు పూజ శ్రద్ధగా చేయటంవలన కామక్రోధములవేగం తగ్గుతుంది. మీకు కష్టంవస్తే కంగారుపడకండి, దానిని మేనేజ్ చేయటం నేర్చుకోండి, మేనేజ్‌చేయటం నేర్చుకొంటే మనస్సులో వత్తిడులు తగ్గిపోతాయి. మనస్సులో వత్తిడులు పెరిగితే అది సహస్రారానికి వచ్చేస్తుంది, మనస్సులో వత్తిడులు తగ్గితే అది మూలంలోనికి వెళ్ళిపోతుంది. అహంకార, మమకారముల మిశ్రమమే దేహాభిమానం. దేహంతో ఏతలంపు అయితే తాదాప్యం పొందుతోందో దానిని మూలతలంపు అంటారు. ఆతలంపు వచ్చాక ఇతర తలంపులు వస్తాయి గాని ఆ తలంపు లేకపోతే ఇతర తలంపులు లేవు. మీరు ఇంటివద్ద అందరూ ఏదో పనులు చేసుకొంటున్నారు. అవన్నీ పెద్ద పెద్ద పనులు అని మీరు అనుకొంటున్నారు కాని అవి అన్నీ రెండవ పక్షం. మీరు వందకోట్లు సంపాదించారు అనుకోండి అది కూడా రెండవపక్షమే అన్నారు. నిజమైనపనిఏమిటి అంటే, వాస్తవమైనపని ఏమిటి అంటే దేహంతో ఏ తలంపు అయితే తాదాప్యం పొందుతోందో దానినుండి విడుదల పొందటానికి, జీవలక్షణాలనుండి విడుదల పొందటానికి నీవు చేస్తున్న ప్రయత్నమే నిజమైనపని. అది ఒక్కటి మాత్రమే నిజమైనపని మిగతాపనులు అన్నీ మిధ్యాపనులు, ఆ పనులవలన నీవు అసత్యంలోనుండి బయటకు రాలేవు. అది ఒక్కటే వాసనలను నశింపచేస్తుంది, నీకు మోక్షస్థితిని కలుగజేస్తుంది. చాలమంది అహంభావనలోనుండి బయటకు రావటానికి ప్రయత్నం చేస్తున్నారు, కాని మిగతా పనులన్నింటికంటే ఇది ఒక్కటే ముఖ్యమైన పనిఅని మీరు ఎవరూ గ్రహించటంలేదు.

మాకోడలు మంచిదికాదు అని మీరు అంటారు అనుకోండి. మీకోడలు ఏమిచేస్తుంది అంటే ఆమంచిదికాదు అనే ఒక్కమాటనే గుర్తుపెట్టుకొంటుంది గాని మనం మంచివారుగా బాగుపడదామని తలంపురాదు. మీరు విమర్శించే బుద్ధితో మీకోడలుకు చెపుతున్నారు గాని బాగుచేయాలనే బుద్ధితో చెప్పటంలేదు. మీకు సద్బుద్ధి ఉంటే అమ్మా! ఇలానడుచుకోవాలి, ఇలానడుచుకొంటే నీ భవిష్యత్‌కు మంచిది అని ఎలానడుచుకొంటే వాళ్ళు బాగుపడతారో అలా చెప్పాలి కాని విమర్శగా చెప్పకూడదు, సత్వగుణంతో చెప్పాలి. తక్కువ మాట్లాడటం ఎక్కువపని చేయటం నేర్చుకోవాలి. అది మీకు మంచిది, నాకూ మంచిది, సమాజానికి మంచిది, దేశానికి కూడా మంచిది. నేను చెప్పేవిషయం మీకు

అర్ధంకావటంలేదు అనుకోండి, ఆపొరపాటు నాదికాని, మీదికాదు. మీరు బాగుపడాలనే తలంపుతో హృదయపూర్వకంగా, నిండుమనస్సుతో చెప్పాలి. నేను ఏదైతే చెపుతున్నానో దాని తాలూక అనుభవం నాకు ఉండాలి. అనుభవంతో చెపితే అది మీమీద పనిచేస్తుంది, మీరు బాగుపడతారు. మనం ఎవరిని ద్వేషించి బాగుచేయలేము, చెప్పేదిప్రేమతో చెప్పాలి. అన్ని రకాల భోగాలు నీకు ఎదురుగుండా ఉండాలి, నీకు వాటిమీద వికారం కలుగకూడదు, అది నిజమైనస్థితి. పూర్వజన్మలో మనం అనుభవించిన భోగాలే ఈ జన్మలో రోగాలు క్రింద వచ్చాయి అని చెపుతారు. భగవంతుడి మీద మనకు పురిపూర్ణమైన భక్తిఉండాలి, ఆయన దగ్గర నుండి మనం ఏమికోరుకోకూడదు. అప్పుడు మన మనస్సు పక్వానికి వస్తుంది. మనం ఏదైనా అడిగితే మనస్సు కలుషితమవుతుంది. అడగకుండా వచ్చేదానికి, అడిగి తెచ్చుకొన్నదానికి చాలాతేడాఉంటుంది. అడిగి తెచ్చుకొన్నది నిన్ను బంధిస్తుంది, అడగకుండా వచ్చినది నిన్ను బంధించదు. భగవంతుడిపట్ల, గురువుపట్ల పరిపూర్ణమైన ప్రేమ ఉంది అనుకోండి, అహంభావన దానంతటఅదే పోతుంది. అయితే మనలో ఆ ప్రేమతత్వం ఎవరికి ఉంది? కోరిక అడుగుతుంది కాని ప్రేమ అడగదు ఇస్తుంది. మనలో అహంభావం బాగా చిక్కబడిపోయి, బలపడిపోయిఉంది. ఒక్క ప్రేమతత్వమే దానిని అటుఇటు షేక్‌చేసి బయటకు గెంటుతుంది. ఎటువంటిపరిస్థితులలోను మనస్సు బాహ్యముఖానికి వెళ్ళకుండా చూసుకో. మనస్సు బాహ్యముఖానికి వెళ్ళకుండా ఉండటానికే మంత్రజపం, రూపధ్యానం. నీసాధనలయొక్క ప్రయోజనం ఏమిటి అంటే మనస్సుకు అంతర్‌దృష్టి కలగాలి. మన శరీరం పుట్టకముందు మనం ఆత్మే, ఇది చనిపోయిన తరువాత మనం ఆత్మే. ఇప్పుడు కూడా మనం ఆత్మే. ఈ శరరం మధ్యలో వచ్చింది, మధ్యలో పోతుంది. మధ్యలో వచ్చిపోయే ఈ శరీరాన్ని పట్టుకొని తిరుగుతున్నాము, అసలు గమ్యాన్ని వదిలి వేస్తున్నాము. దానిని ఎంత బాగా చూసినా అది వెయ్యి సంవత్సరాలు ఉంటుందా? ఉండదు. అది ఎలా వచ్చిందో అలా పోతుంది. ఇప్పుడు కూడా మనం బ్రహ్మమే, ఆత్మే. కాని మనకు ఆ దృష్టి లేదు, ఎప్పుడు శరీరదృష్టిలోనే ఉంటున్నాము. దానితో తాదాప్యం వలన అసలు వస్తువు మనకు వ్యక్తం కావటంలేదు. ఈ శరీరం ఉండటం వలన మనకు లాభం లేదు. ఇది పోవటం వలన మనకు నష్టం లేదు. ముందు మీరు నేర్చుకోవలసింది, తెలుసుకోవలసింది సమగ్రంగా తెలుసుకొంటే మిమ్మల్ని చూసి కొంతమంది నేర్చుకొంటారు. మీరు బాగుపడితే, మీకుసత్వగుణం వస్తే అది చూసి చాలామంది బాగుపడతారు. మీరు ఎందుకు



బాగుపడలేకపోతున్నారు అంటే ఎవరైనా మిమ్మల్ని విమర్శిస్తే ఆత్మవిశ్వాసం పోగొట్టుకొంటున్నారు అంటే మీరు పిరికివారు అని అర్థం. భయం వలన ఆత్మవిశ్వాసం తగ్గుతుంది. గుడిలో ఉన్న దేవుడితో మనకు ప్రమాదంలేదు, కాని హృదయంలో ఉన్న దేవుడితో మనకు ప్రమాదం. వాడు మన కూడా ఉంటాడు, ఎక్కడకు వెళ్ళినా ఉంటాడు, వాడు మన తలంపును చూస్తూ ఉంటాడు. మనం ఏదైనా మాట్లాడితే మన ప్రక్క ఉన్న వారికి వినపడకపోవచ్చు కాని వాడు వింటాడు. లోపలఉన్న దేవుడికి కనపడకుండా మీరు ఏదైనా చేద్దామంటే అది మీకు సాధ్యం కాదు. ఆయన కళ్ళు మనం మూయలేము, ఆయన కర్మసాక్షి. ఆయన నీ కంటికి కన్ను అయి, నీ చెవికి చెవి అయి, నీ తలంపుకు తలంపు అయి, కారణానికి కారణం అయి ఉన్నాడు. ఆయనే మనలో అంతర్యామిగా ఉన్నాడు. ఆయనను మనం మోసం చేయలేము. మూలతలంపు మనలోపల నుండే వస్తోంది అని మనకు తెలుస్తుంది. మన యజమాని అయిన భగవంతుడు మూలతలంపుమూలంలో ఉన్నాడు. మూలతలంపును పట్టుకొని దాని మూలంలోనికి వెళితే భగవంతుడి దర్శనం అవుతుంది. అంతదూరం మనం వెళ్ళలేక పోతున్నాము. ఎందుచేతనంటే మనకు వైరాగ్యం లేదు, అభ్యాసం లేదు, సాధన లేదు. మీరు ఏదైనా మందు వాడేటప్పుడు పత్యం ఎంత ముఖ్యమో, మీరు సాధన చేసేటప్పుడు వైరాగ్యం అంత ముఖ్యం. మూలతలంపు ఎక్కడయితే ఉదయించి వస్తోందో అక్కడే భగవంతుడు ఉన్నాడు. అది మనం మర్చిపోకూడదు. మూలతలంపు మూలం తెలిస్తే ఈశ్వరుడు తెలియబడతాడు. ఈశ్వరుని యొక్క స్వరూపం ఉండటమే,ఆయన స్వరూపం శాంతి, సుఖం, ఆనందం, ఆయనకు చావు ఎలా ఉంటుందో తెలియదు ఎందుచేతనంటే ఆయన పుట్టలేదు కాబట్టి. నేను పుట్టాను అనుకొనే ప్రతీవాడు చనిపోతాడు, నేను చనిపోతున్నాను అనుకొనే ప్రతీవాడు పుడతాడు. నాకు మోక్షం ఎప్పుడు వస్తుంది అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. ఇప్పుడు నీవు పుట్టాను అనుకొంటున్నావా, పుట్టలేదు అనుకొంటున్నావా అని అడిగారు. నేను పుట్టాను అనుకొంటున్నాను అని చెప్పాడు. నేను పుట్టాను అనుకొంటే ఈ జన్మలో నీకు మోక్షం లేదు అన్నారు. పుట్టింది ఎవరు? దేహం పుట్టింది, అది నీవు కాదు. నువ్వు పుట్టలేదు అన్న సంగతి నీకు తెలియాలి. ఏది పుట్టలేదు, నీవు ఏదిగా ఉన్నావో అది పుట్టలేదు. దాని తాలుక అనుభవం నీకు వస్తే గాని నీకు మోక్షం లేదు. తల్లి కడుపులోనుండి వచ్చినది మొదలు స్మశానానికి వెళ్ళేవరకు ఎవరి యాత్ర ఒకే రకంగా సాగదు, హెచ్చుతగ్గులు ఉంటాయి. ప్రారబ్ధం లేకుండా దేహంరాదు.

ప్రారబ్దం ప్రకారం సంఘటనలు జరుగుతూ ఉంటాయి. మీలో కొంతమందికి అదృష్టం, కొంతమందికి దురదృష్టం వెంటాడవచ్చు. మీరు గ్రహించవలసింది ఏమిటి అంటే అదృష్టం వచ్చినప్పుడు పొంగిపోయి, దురదృష్టం వచ్చినప్పుడు కృంగిపోతూ ఉంటే మీ శాంతి, నిర్మలత్వం చెడిపోతుంది, సాధన అంతా సున్నా అయిపోతుంది. ఈశ్వరుని నిరంతరం స్మరించటం వలన మిమ్మల్ని ఇబ్బంది పెట్టే ఇతర తలంపులు రావు. ఈశ్వర భావన, ఈశ్వరుని పట్ల మీకు ఉన్న ప్రేమభావన, ఆ తలంపే మిమ్మలను మోక్షానికి తీసుకొని వెళుతుంది. స్మరణ తక్కువ అనుకోవద్దు. మీకు ఇష్టంలేని వారు జ్ఞాపకం వచ్చారు అనుకోండి, మీకు కోపం వస్తుంది, దుఃఖం వస్తుంది. అంటే తలంపుకు వేగం ఉందా? లేదా? ఉంది. భౌతికవిషయాలకే ఇంత వేగం ఉన్నప్పుడు ఈశ్వరుని పట్ల తలంపుకి, స్మరణకి ఇంక ఎంత వేగం ఉంటుందో ఆలోచించుకోండి.

మనస్సును నియమించుకొన్నవారు ఎక్కడవున్నా వారికి వైకుంఠం క్రిందే ఉంటుంది. మనస్సే పెంట. దానికి లోచూపు అలవాటు చెయ్యాలి. కొంతమందికి లోచూపు తెలియదు. శరీరం ఒక్కటే నిజం అనుకొంటారు. మనం బూరి చాలా బాగుంది అని తింటాము. కాని ఎద్దులకు బూర్లుపెడితే చిట్టు తిన్నట్లు ఆ బూరెలు తినేస్తాయి ఎందుచేతనంటే జంతువులకు మెంటల్‌లైఫ్ ఉండదు. చాలామంది మనుషులు అంతే. మనకు మైండ్ ఇచ్చినా ఇంచుమించుగా జంతువుల బిహేవియర్‌లో ఉంటున్నాము. మనకు మానవత్వం తక్కువ, పశుప్రవృత్తి ఎక్కువ అనుకోండి మనకు జ్ఞానం రాదు. కొంతమంది రూపానికి మనిషే కాని లోపల పశుప్రవృత్తి ఎక్కువ ఉంటుంది. మానసికజీవితం లేనివాడికి, హృదయవికాశం లేనివాడికి ఆత్మశాంతి లేదు, ఆత్మజ్ఞానం లేదు. మీకు ఏదైనా దుఃఖం వచ్చింది అనుకోండి, ఏ త్యాగరాజసంగీతమో వింటున్నారు అనుకోండి, ఆ సంగీతం విన్నంతసేపు దుఃఖానికి సంబంధించిన తలంపు లోపల అణిగిఉంటుంది.. సంగీతంఆగిన తరువాత ఆదుఃఖానికి సంబంధించిన తలంపు మరల వచ్చేస్తుంది. మూలతలంపు పరిష్కారం అయ్యే వరకు, అది నశించేవరకు నీకు శాశ్వతమైన ఆనందం గాని, శాంతి గాని లేనేలేదు. మనస్సు అణగటం వేరు, మనస్సు నశించటం వేరు, అణిగిన మనస్సు మరల విజృంభించే అవకాశం ఉంది. మూలతలంపు అనే సమస్యనుండి పారిపోవటానికి ప్రయత్నం చేయకు, ఆ సమస్యను పరిష్కారం చేయటానికి ప్రయత్నించు. నీకు ఎందుకు

**20-01-2003**

దుఃఖం వస్తోంది? దానికి కారణం తెలుసుకొని ఆ కారణాన్ని తొలగించుకో. దుఃఖం అనేది ఒక తలంపు. ఆ తలంపు ఎవరికి వస్తుంది? దేహము నేను అనే తలంపుకు వస్తోంది. అదీ తలంపే, ఇదీ తలంపే. ఈ తలంపుకు ఆతలంపు వస్తోంది. ఈ తలంపు మూలం చూసావనుకో ఈ తలంపు పత్తాలేకుండా పోతుంది, అప్పుడు ఆ తలంపుకూడా పోతుంది. అప్పుడు దుఃఖం నుండి శాశ్వతంగా విడుదల పొందుతావు. ఇంక ఏరకమైన దుఃఖం ఉండదు. ఇది కింగ్లీసైన్స్, దేహాన్ని ప్రారబ్ధానికి విడిచిపెట్టండి. అది ఎక్కడ ఎలా ఉండాలో అలా ఉంటుంది. దేహం పోయినా ఆత్మ ఎప్పుడూ ఉంటుంది. దానికి, ఆత్మకు ఎటువంటి సంబంధం లేదు. అయితే మీ శరీరం పోయిన తరువాత కూడా మీతో అనుబంధం కుదురుతుందా అని భగవాన్‌ను అడుగుతున్నారు. ఈ శరీరం ఉన్నప్పుడు కూడా మిమ్మల్ని ప్రేమించేది ఈ శరీరం కాదు, ఏదైతే మిమ్మల్ని ప్రేమిస్తోందో దానికి చావులేదు అని చెప్పారు. మన హృదయంలో ఉన్న చైతన్యమే మనకు నిజమైన గురువు. మన హృదయంలో ఏదోఉంది, అది మనకు తెలియటంలేదు, దానిని తెలుసుకోవాలి అని మనం తీవ్రంగా ప్రయత్నం చేస్తూ ఉంటే, అది ఏమనుకొంటుంది అంటే వీడు మనలను తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాడు, పాపం వీడికి తెలియబడాలి అని అది అనుకొంటుంది. ఎక్కడో వాడు, మనం కలుసుకొంటాము, జ్ఞానం వచ్చేస్తుంది, పాత సంవత్సరం పోయి క్రొత్తసంవత్సరం వస్తూ ఉంటుంది కదా, అలాగే మీలో ఉన్న పాత సంస్కారములను, పాత గొడవలను వదిలివేయండి. మీరు బాగుపడే సంస్కారములను ఏర్పాటు చేసుకోండి. మిమ్మల్ని పీడించే పాతవాసనలకు వీడ్కోలు చెప్పండి, మిమ్మల్ని బాగుపరచే కొత్త వాసనలకు స్వాగతం చెప్పండి. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే నీకు సాధన అంటే ఏమిటో చెప్పమంటావా? ఇప్పుడు నీ మనస్సు నిన్ను మాయం చేస్తోంది ఇప్పుడు నువ్వు నీ మనస్సును మాయం చెయ్యి. ఇదే సాధన. మనస్సును నువ్వు మాయం చెయ్యాలంటే అది మాయమవుతుందా? ఎంతోకాలంనుండి అది నీకూడా వస్తోంది అందుచేత నీవు దానిని మాయం చేయలేవు, దానికి ఒక ఉపాయం ఉంది, దానిని హృదయంలోనికి నెట్టితే, హృదయంలో దానిని ఉంచగలిగితే అది మాయమవుతుంది గాని ఇంకోరకంగా దానిని మాయం చేయలేము. నువ్వు ఎక్కడ నుండి వచ్చావో అక్కడకు వెళ్ళు. మనస్సును అక్కడ ఉంచు, అక్కడ ముంచు, అప్పుడు అది అదృశ్యమవుతుంది. ఇంతకాలం అది నిన్ను మాయచేస్తోంది. ఇప్పుడు నీవు దానిని మాయచేయటానికి ప్రయత్నం చేయి, అదే సాధన.

**రమణ భాస్కర**

అసలు సాధన ఎవరు చేస్తున్నారు? మనస్సే చేస్తోంది. అదే పెద్ద దొంగ, అదే పెంట. దానిని మాయం చెయ్యండి. పీడవదిలిపోతుంది. సాధన చేసేవాడిని మాయం చేయండి. వాడు నిజం అనుకొంటున్నాము. వాడిని వాడి మూలంలోనికి పంపితే కాని వాడు నిజంకాదు అన్నసంగతి మనకు తెలియదు. మనోమూలంలో ఉన్న చైతన్యానికి పరిమితులు లేవు. మనం పరిమితులలో ఉన్నాము అంటే మనస్సులో ఉన్నట్లు. మన మనస్సును ఎప్పుడైతే హృదయంలో మాయం చేసావో అప్పుడు ఉన్నది చైతన్యం ఒక్కటే, అది తప్ప ఇంక ఏమీ లేదు అన్న సంగతి నీకు తెలుస్తుంది, ఆ అనుభవం నీకు వచ్చినప్పుడు నువ్వు శాంతిసాగరంలో, ఆనందసాగరంలో ఊగిసలాడతావు. అప్పుడు ఎటుచూసినా ఆనందమే, ఎటుచూసినా శాంతే, ఎటుచూసినా సుఖమే.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 21-12-2002. జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు శ్రీ రమణజయంతి. భగవాన్ శ్రీరమణమహర్షి 1879వ సంవత్సరం డిసెంబరు 30వ తేదీన తిరుచ్చిళిలో జన్మించారు. ఆయన తండ్రి సుందరమయ్యర్, తల్లి అళగమ్మ. వారి కుటుంబానికి ఇష్టదేవత వెంకటేశ్వరస్వామి అందుచేత భగవాన్‌కు వేంకట్రామన్ అని పేరు పెట్టారు. భగవాన్ చిన్నతనంలోనే ఆయన తండ్రి స్వర్గస్తులైనారు. తండ్రిపోయిన తరువాత భగవాన్‌ను ఆయన పినతండ్రి మధురాయి తీసుకొని వెళ్లారు. భగవాన్ పినతండ్రి ఇంటివద్ద ఉండి చదువుకొనేవారు. ఆయన ఒకరోజు స్కూలు నుండి వస్తూ ఉంటే ఒక బంధువు ఎదురు వచ్చాడు. ఎక్కడ నుండి వస్తున్నావు అని అడిగితే అరుణాచలం నుండి వస్తున్నాను అని చెప్పాడు. మొదటిసారి అరుణాచలంపేరు విన్నంతనే ఆయనకు శరీరం అంతా గగుర్పాటు వచ్చేసింది, అది జన్మాంతర అనుబంధం. అరుణాచలం అంటే ఆయనకు ఊరుగుర్తుకురాలేదు. అరుణాచలం అంటే భగవంతుడే, మన తండ్రే అనుకొన్నాడు. ఆయనకు జన్మాంతరంలో శివసంస్కారం ఉంది. శివుడు అంటే మనం దేవుడు అనుకొంటాము. ఆయనకు శివస్మరణ వచ్చేసరికి ఆయన మన తండ్రే, ఆయన మనం ఒకటే కుటుంబం అనిపించేది. అరుణాచలంతో ఆయనకు ఉన్న జన్మాంతర



అనుబంధం ఎటువంటిది అంటే 54 సంవత్సరములు అరుణాచలంలో ఉంటే ఈ అరుణాచలం వదిలిపెట్టి ఎక్కడికైనా వెళ్లాలి అనే తలంపు కూడా రాలేదు అని చెప్పాడు. భగవాన్ పెరియపురాణం అనే ఆధ్యాత్మిక గ్రంధం చదివారు. అందులో 63 మంది శివభక్తుల జీవిత చరిత్రలు ఉన్నాయి. ఈ 63 మంది భక్తులలో ఒకరిగా నేను అవ్వగలనా అనే భావన భగవాన్‌కు లోపలనుండి వచ్చింది. ఆయన జీవితంలో ముఖ్యమైన సంఘటన మరణానుభవం. 1896 సం॥రం జూలై 16వ తేదీన మధురైలో ఆయన పినతండ్రి ఇంటివద్ద భగవాన్‌కు మరణానుభవం కలిగింది. మామూలుగా శరీరం మరణించింది, శ్వాస ఆగిపోయింది, రక్త ప్రసరణ ఆగిపోయింది. శరీరం మరణించినప్పుడు నేను మరణించాలి కదా, నేను మరణం లేకుండా ఉన్నాను ఏమిటి? మరణించేది దేహమే, దేహం పోయిన తరువాత కూడా మనం ఉంటాము అని అనుభవపూర్వకంగా గ్రహించాడు. మరణానుభవం ద్వారా మరణాన్ని జయించాడు. మరణానుభవంలో దేహగతమైననేను విడిచిపెట్టేసింది, ఆత్మగతమైననేను ఆయనకు వ్యక్తమయింది. ఇది అంతా 10 నిమిషాల కాలంలో జరిగిపోయింది. మరణానుభవం ద్వారా పూర్ణజ్ఞాని అయి కూర్చొన్నాడు. మరణానుభవం ఎలా కలిగింది అంటే అది దేవరహస్యం. అంతకు ముందే ముగ్గిపోయి ఉంటాడు, అప్పుడు రాలిపోయాడు. మనం కూడా ఈ జన్మలో కష్టపడి సాధన చేస్తే ఇప్పుడు ఆత్మానుభవం కలగకపోయినా మనం చేసిన సాదన రాబోయే జన్మకు కలిసి వస్తుంది. టీనేజ్ వరస్టు ఏజ్ అంటారు, అటువంటి టీనేజ్‌లో భగవాన్‌కు మరణానుభవం కలిగింది. ఆయనకు ఆత్మానుభవం కలిగిన తరువాత సమాధిస్థితి వరించి వస్తూ ఉంటే ఆయన అన్నగారు ఏమన్నారుఅంటే నీబోటివాడికి ఇంటిదగ్గర పని ఏముంది, ఎక్కడికైనా పోరాదా అంటే ఆయనకు కోపం రాలేదు, నిజమే ఎక్కడికి పోవాలి? లోపలనుండి అరుణాచలం, అరుణాచలం అనే తలంపు వచ్చింది. మరి డబ్బు ఎక్కడిది? అప్పుడు అన్నగారి నోరును ఈశ్వరుడు ఉపయోగించుకొన్నాడు. ఫలానా చోట డబ్బు ఉంది తీసుకొని నా కాలేజీ జీతం కట్టు అన్నాడు. ఇచ్చేవాడు ఈశ్వరుడు, పుచ్చుకొనేవాడు ఈశ్వరుడు. కొంత డబ్బు తీసుకొని ఇది ఒక మంచిపని నిమిత్తం పోతోంది, ఈ శరీరం కోసం వెతకవద్దు, డబ్బు ఖర్చుపెట్టవద్దు, దీనికోసం బెంగపెట్టుకోవద్దు అని వ్రాసి క్రింద సంతకం పెట్టలేదు. మరణానుభవంలో సంతకం పెట్టేవాడు చనిపోయాడు. 1896 సంవత్సరం సెప్టెంబరు 1వతేదీ ఉదయం అరుణాచలం చేరుకొన్నాడు. అరుణాచలం వచ్చిన తరువాత వేగంగా

వెళ్ళి అరుణాచలేశ్వరుని దర్శనం చేసుకొన్నాడు. అరుణాచలేశ్వరునితో నువ్వు రమ్మంటే వచ్చాను, నా అంతట నేను రాలేదు, ఈ శరీరాన్ని ఎలా ఉపయోగించుకోవాలో అలా ఉపయోగించుకో అని విన్నవించుకొన్నాడు. ఆయనకు ఆయనే సన్యాసంపుచ్చుకొన్నాడు. చొక్క చింపిఒక ముక్క గోచీ పెట్టుకొన్నాడు, లాగు, చొక్కా, తన దగ్గర ఉన్నడబ్బు, మిఠాయిలు అన్నీ కొలనులో వేసాడు అంటే పరిపూర్ణంగా ఈశ్వరుడి మీద ఆధారపడిపోయాడు. అది శరణాగతి అంటే. శరణాగతిగురించి చెప్పటం వేరు. శరణాగతిగా ఉండటం వేరు. భగవాన్ కొంతకాలం గుడిలో పాతాళగుహలో ఉన్నారు. తరువాత మామిడితోటలో, పవలకున్రులో కొంతకాలం ఉన్నారు. అక్కడ ఉండగానే వాళ్ళ అమ్మగారు వచ్చి ఇంటికి రమ్మని అడుగుతారు. భగవాన్ వారి అమ్మగారికి పలకమీద ఒక మాట వ్రాసి ఇచ్చారు. ఈశ్వరుడు జీవులను వారివారి ప్రారబ్ధముననుసరించి ఆడిస్తున్నాడు, జరగవలసినది జరిగే తీరును, జరుగరానిది ఎవరు ఎంత ప్రయత్నం చేసినా జరుగనే జరుగదు, ఇది నిశ్చయము, ఊరక ఉండటం ఉత్తమం. ఇది భగవాన్ చెప్పిన మొదటి సందేశం. తరువాత భగవాన్ కొంతకాలం విరూపాక్షగుహలో ఉన్నారు. 1907 సంవత్సరంలో అక్కడకు గణపతిశాస్త్రిగారు వచ్చారు. శాస్త్రిగారు భగవాన్‌ను దర్శించి చదవవలసిన శాస్త్రాలు అన్నీ చదివాను, జపం చేసాను, తపస్సు చేసాను కాని తపస్సు యొక్క రహస్యం నాకు తెలియలేదు అన్నారు. భగవాన్ చాలా తక్కువ మాట్లాడేవారు. తన గొంతుని సవరించుకొని మనం నేను, నేను అంటున్నాము కదా అది ఒక తలంపు. ఆ నేను అనే తలంపు ఎక్కడ ఉదయించి వస్తోందో అక్కడకు వెళ్ళాలి అదే తపస్సు యొక్క ప్రయోజనం. నేను అనే తలంపు ఎక్కడయితే ఉదయించి వస్తోందో ఆ హృదయాకాశం దగ్గరకు వెళితే ఇది నశిస్తుంది, అక్కడ ఉన్న వస్తువు తానుగా వ్యక్తమవుతుంది. ఓ అరుణాచలేశ్వరుడా, నువ్వు అంతటా ఉన్నావు, హృదయాకాశంలో కూడా ఉన్నావు. నీవు ఏమి చేస్తావు అంటే, హృదయాకాశంలోనికి నన్ను తీసుకొని వెళ్ళి నీలో ఐక్యం చేసుకొన్నావు అనుకో ఈ తలంపుల పీడ, సంసారం పీడ, రాగద్వేషముల పీడ, జననమరణాల పీడ అంతా వదిలిపోతుంది. హృదయాకాశంలోనికి మూలతలంపును తీసుకొనివెళ్ళి నీ అనుభవాన్ని కలుగజేస్తే అది నశిస్తుంది, అది నశిస్తే ఇంక కోరికలు లేవు, బంధాలు లేవు, తలంపులు లేవు, దుఃఖం లేదు. మనకు మంచితలంపులు వచ్చినా చెడుతలంపులు వచ్చినా ఇవన్నీ అహంభావనకే వస్తున్నాయి. ఈ తలంపులు ఆగమంటే ఆగుతాయా? ఆగవు మూలతలంపు వెళ్ళి హృదయాకాశంలో



కలిస్తే అవి ఆగుతాయి. నువ్వు అంతటా ఉన్నావులే కాని ముందు ఈ పని చూడు. నువ్వు అనుభవంలోనికి వచ్చాక ఇక్కడ ఉన్నవాడే అంతటా ఉన్నాడు వాడే వీడు అనే అనుభవం సహజంగానే వచ్చేస్తుంది. వినాయకుడు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహాలకు పళనిస్వామి ఆరాధించేవాడు. భగవాన్ అప్పడు తోటలో ఉండేవారు. ఈ విగ్రహాలను ఆరాధిస్తున్నావు ఏమిటి ఈ విగ్రహమే అక్కడ శరీరంతోటి ఉంది అంటే అప్పడు పళనిస్వామి వచ్చి భగవాన్‌కు సేవచేయటం ప్రారంభించారు. పళని స్వామి భిక్ష చేసుకొని వచ్చి సగం భగవాన్, సగం ఆయన ఇద్దరూ తినేవారు. భగవాన్ నీడ పళనిస్వామి. శాస్త్రిగారు వచ్చినప్పడు పళనిస్వామిని ఈయన పేరు ఏమిటి అని అడుగుతారు. మాకు తెలియదు కొంతమంది బ్రాహ్మణస్వామి అంటారు, తల్లిదండ్రులు పెట్టిన పేరు వెంకట్రామన్ అంటాడు. అప్పడు శాస్త్రిగారు రమణమహర్షి అని పేరు పెట్టారు. అందరూ రమణమహర్షి అని పిలుస్తారు కాని భక్తులుమటుకు భగవాన్ అని పిలుచుకోండి అని శాస్త్రిగారు చెప్పారు. నీటి ఇబ్బంది వలన భగవాన్ విరూపాక్షగుహ వదలి స్కందాశ్రమం వెళ్ళారు కాని పళనిస్వామి విరూపాక్షగుహను వదలివెళ్ళలేదు. నువ్వు విరూపాక్షగుహను వదలనంటున్నావు అయితే నేనే నిన్ను చూడటానికి వస్తాను అన్నారు భగవాన్, వాడు గురువు. ప్రతీరోజు పళనిస్వామిని చూడటానికి భగవాన్ విరూపాక్ష గుహకు వచ్చేవారు. కోరిక ఎంత బలీయమైనదో చూడండి. పళనికి చావుదగ్గరకు వచ్చేస్తోంది, జ్వరం ఎక్కువగా వచ్చేది. ఒక భక్తుడు పళనికి మామిడిపండు తెచ్చి ఇచ్చాడు. పళని గొప్ప వైరాగ్యపురుషుడు. అంతటి వాడికి కూడా ఆ జ్వరంలో మామిడిపండు తినాలనిపించింది. ఇదే మాయ. అందుచేతనే భగవంతుడు గీతలో చెప్పాడు నా పాదాలను ఆశ్రయించకుండా కేవలం నీ తెలివితేటల వలన మాయను జయించలేవు. నా పాదాలను ఆశ్రయిస్తే నువ్వు మాయలోనుండి బయటపడతావని చెప్పాడు. పళని మామిడిపండు తినటానికి శుభ్రంగా కడుగుకొన్నాడు, నోట్లో పెట్టుకొందామని అనుకొంటున్నాడు ఇంతలో భగవాన్ వచ్చారు. ఆయన వచ్చే శబ్దం విని, ఆయన వెళ్ళిపోయిన తరువాత తిందామని మామిడిపండును దాచేసాడు. భగవాన్ పళనితో జ్వరం తగ్గటం లేదు ఏమిటి అని అడుగుతూ ఇక్కడ మామిడి పండు వాసన వస్తోంది ఏమిటి అని అడిగారు. అంత వైరాగ్యపురుషుడు కూడా పండు లేదని అబద్ధం చెప్పాడు. ఇదే మాయ అంటే. భగవాన్ వాసన వస్తోంది ఏమిటి అని అంతా వెతికి మామిడిపండు దొరికింది అని, ఆ పండును పళని ప్రక్కన కూర్చొని తినేసి టెంకకూడా నాకేసి బయట పడేసి

వెళ్ళిపోయారు. మామిడి పండు తింటే ఫళనికి జ్వరం ఎక్కువైపోతుంది, పండు తినవద్దు అంటే మానేలా లేడు అందుకే భగవాన్ తినేసారు. 1922 సంవత్సరంలో తల్లిగారు శరీరం వదిలిపెట్టారు, తల్లి శరీరాన్ని కొండపాదం దగ్గర సమాధి చేసారు. తరువాత ఒకరోజున స్కందాశ్రమం నుండి క్రిందకు వచ్చిన భగవాన్ తిరిగి పైకి రాకుండా తల్లి సమాధి దగ్గర ఉండిపోయారు. స్కందాశ్రమం నుండి క్రిందకు నా అంతట నేను రాలేదు, ఏదో మహత్తర శక్తి నన్ను ఇక్కడకు తీసుకొనివచ్చింది అన్నారు. అక్కడే రమణాశ్రమం ఏర్పడింది. ఆయన భక్తులకు అందరకూ అందుబాటులో ఉండేవారు. 1950 సంవత్సరం ఏప్రియల్ 14వ తేదీన ఆయన శరీరాన్ని విడిచిపెట్టారు.

పెదవులతో భగవంతుడిని స్తోత్రం చేయటం కంటే భగవదనుభవం పొందటానికి భగవంతుడు చెప్పినట్లు చేతులతో పనిచేయటం మంచిది. శరీరం స్మశానంలో దగ్ధమవుతుంది కాని మనస్సు శుద్ధ చైతన్యంలో దగ్ధమవ్వాలి. కాసేపు జ్ఞాపకం వచ్చింది అంటావు, కాసేపు మర్చిపోయానుఅంటావు కాసేపు దుఃఖంగా ఉంది అంటావు, కాసేపు సంతోషంగా ఉంది అంటావు, ఇదంతా అపరిశుద్ధ మనస్సు అన్నారు భగవాన్. సంసారం అంటే నీ అపరిశుద్ధ మనస్సే సంసారం. అది హృదయాకాశంలోనికి వెళితేగాని దగ్ధం అవ్వదు. శరీరం ఉన్నంతకాలం ఏదో రోగం వస్తుంది, అలాగే మనస్సు ఉన్నంతకాలం ఏదో కోరికలు వస్తాయి. శరీరం కాలిపోయిన తరువాత ఇంక రోగాలు లేవు, అలాగే మనస్సు హృదయాకాశంలో దగ్ధమయిన తరువాత ఇంక కోరికలు లేవు. అప్పుడు కాని జననమరణ ప్రవాహంలోనుండి విడుదల పొందలేవు. మనవి అన్నీ దొంగ చావులు, దొంగ పుట్టుకలు. రోజూ పుట్టి రోజూ చనిపోయే వారిది నిజమైన పుట్టుకలు కాదు, ఇవి అన్నీ కల్పితములు. ఎవడైతే తిరిగి పుట్టడో వాడు నిజంగా చనిపోయినట్లు. మనం అబద్ధం, అబద్ధంగా చనిపోతున్నాము అంటున్నారు ఆచార్యులవారు. నిన్ను నీవు చూసుకొని లోకాన్ని చూడు అన్నారు భగవాన్. నిన్ను నీవు చూసుకోకుండా లోకాన్ని చూస్తే బంధింపబడతావు, మాయలో పడిపోతావు, నిన్ను నీవు చూసుకొని లోకాన్ని చూస్తే అంతటా నీవే కనబడతావు. నువ్వు దేనినైతే తెలుసుకోవాలనుకొంటున్నావో ఆ విషయంలో అజాగ్రత్తగా ఉండకు. నీ అజాగ్రత్తే జననమరణాలకు కారణమవుతుంది. నీ మనస్సుకు దాని మూలం తెలిసే వరకు ఏదో ఒక దానితో తాదాప్యం పొందుతూ ఉంటుంది, కానిదానితో తాదాప్యం పొందటం



మానదు, అదే సంసారం. నువ్వు కానిదానితో తాదాప్యం తగ్గించుకోవటానికే యోగం అవసరం. లోపల ఉన్న బ్రహ్మం ఎంత పవిత్రంగా ఉందో అంత పవిత్రత నీ మనస్సుకు వస్తే గాని అది తదాకారం చెందదు. మనకు నేను అనేటప్పటికి దేహం స్ఫురిస్తుంది, జ్ఞానికి నేను అనేటప్పటికి బ్రహ్మం స్ఫురిస్తుంది. దానికి చావు లేదు కాబట్టి నేను పోను అన్న సంగతి వాడికి అనుభవంలో తెలుస్తూ ఉంటుంది. మన అహంకారాన్ని మనం మర్చిపోయేదీ లేదు, మనకు ఆత్మజ్ఞానం వచ్చేదీ లేదు. మిమ్మల్ని మీరు మర్చిపోవటం ప్రారంభిస్తే మీకు దేనితోటీ తాదాప్యం ఉండదు. ఉన్నది శివుడు, లేనిది జీవుడు. మనం శివుడు లేడు, జీవుడు ఉన్నాడు అనుకొంటున్నాము. భగవంతుడు ఉన్నాడు అని మనకు నిశ్చయం రావాలి, నిశ్చయం వస్తే గాని హృదయంలోనికి దారికనబడదు. కంచి పరమాచార్యులు ఒకనితో ఇప్పుడు నీవు ఎలాగ ఆలోచిస్తున్నావో అలాగ ఆలోచించకు, నీ ఆలోచనలో క్రమంలేదు, నువ్వు ఎలాగ మాట్లాడాలనుకొంటున్నావో అలాగ మాట్లాడవద్దు. నువ్వు ఎలాగ ఆలోచిస్తున్నావో అలాగ ఆలోచిస్తే, నీవు ఎలాగ మాట్లాడాలి అనుకొంటున్నావో అలాగ మాట్లాడితే నీ స్వరూపానికి దూరమవుతావు అని చెప్పారు. నీ హృదయగుహలోనికి వెళ్లటానికి సహకరించేలాగ ఆలోచించు, మాట్లాడు అంతేగాని నీవు అనుకొన్నట్లు మాట్లాడవద్దు అని చెప్పారు. నీకు లోపల అహంకారం ఉంటుంది కాని లేదని నీవు అనుకొంటున్నావు. స్థూలరూపంలో లేకపోయినా సూక్ష్మరూపంలో ఉంటుంది. గురువు చెప్పిన మాటయందు మనకు నమ్మకం లేదు, అది మన దురదృష్టం. అహంకారం నీలోపల సూక్ష్మరూపంలో ఉంటుంది. ఉన్నదానిని నీవు లేదు అనుకోవటం వలన ప్రమాదంలోపడతావు కాబట్టి లోపల ఉన్న అహంకారాన్ని కెలికి, పెద్దది చేసి, దానిని గుర్తించేటట్లు చేసి, దానిని తొలగించుకోవటానికి నీకు శక్తిని ఇస్తాడు. వాడు గురువు. నీకు ఆత్మవిశ్వాసం ఎలా పెంచాలో, నీ జీవితాన్ని ఎప్పుడు ఎలా మలుపు తిప్పాలో గురువు చూసుకొంటూ ఉంటాడు.

రాగద్వేషములతో మిశ్రితమైనటువంటి, జననమరణములతో మిశ్రితమైనటువంటి ఈ సాగరంలో నుండి బయటపడాలంటే ఒకటే ఉపాయం ఉంది, అంతటా వ్యాపించి ఉన్న వస్తువు, చైతన్యం నీకు వ్యక్తమవ్వాలి. చైతన్యం నీకు వ్యక్తమయినప్పుడు ఈ దుర్గ్మతలనుండి, అజ్ఞానంలోనుండి బయటకు వస్తావు, అప్పటివరకు నీవు బయటకు వచ్చే

అవకాశంలేదు. ఏ వస్తువు తనంతట తానుగా ప్రకాశిస్తుందో, ఏ ప్రకాశం వలన ఈ ప్రపంచం తెలియబడుతోందో నీ మనస్సును దానిమీదపెట్టి ధ్యానిస్తే కదా ఈ రాగద్వేషములనుండి బయటకువచ్చేది. ఈశ్వరుడిని ధ్యానిస్తూ ఉంటే అహంభావన రాలిపోతుంది. సూర్యుడు ఉదయించటం, చీకటి పోవటం ఎలా జరుగుతుందో, అలాగ శవబుద్ధి నశించటం శివబుద్ధి కలగటం ఒకేసారి జరుగుతుంది. మన స్వరూపమే బ్రహ్మం, మన పేరే బ్రహ్మం, మనం బ్రహ్మం అయిఉండి బ్రహ్మంను వెతుక్కొంటున్నాము, నీవు బ్రహ్మమే అది తెలియక ఇలా వెతుక్కుంటున్నావు అని మనకు తెలియజెప్పేవాడే గురువు. మన హృదయంలో ఉన్న చైతన్యం మనకు తెలియకుండా ఏదో అడ్డువస్తోంది అని నీవు అనుకొంటున్నావు. ఏదీ అడ్డురావటం లేదు, అది కూడా ఒక తలంపే, అది కూడా కల్పితమే. ఈ కల్పిత గొడవలు తీసి ఒక ప్రక్కన పెట్టు, అదే సాధన. నీకు జ్ఞానం కలిగే రోజు వచ్చేస్తుంది, నీకు జ్ఞానం కలిగాక ఈ గొడవలు అన్నీ కల్పితాలు, నేను చేసిన సాధన కల్పితం అని నీకు తెలుస్తుంది. భగవాన్‌తో ఒక భక్తుడు నేను బాగా సాధన చేస్తున్నాను అన్నాడు. భగవాన్ అంటారు సాధన చెయ్యి, సాధన చెయ్యి సాధనలో ఏమీలేదు అని తెలిసేవరకూ సాధన చెయ్యి. జ్ఞాపకం సంసారం, మరపు సంసారం. ఎందుచేతనంటే జ్ఞాపకం పెట్టుకొనేది మనస్సు, మర్చిపోయేది మనస్సు. ఈ మనస్సే సంసారం. ఎవరైనా కాశీ వెళతాను అంటే వెళ్ళిరండి అక్కడ ఏమీలేదు అని తెలుసుకోవటానికి వెళ్ళిరండి అనేవారు. ఉన్నదంతా నీహృదయంలోనే ఉంది, బయట ఏమీలేదు అనే వారు. నీ వాసన వలన బయట ఏదో ఉందని నీకు అనిపిస్తోంది అంతే గాని బయట ఏమీలేదు. 24 గంటలు ప్రపంచాన్ని తలపెట్టుకొనే బదులు నిర్మలంగా కూర్చొని కొద్దిసేపు భగవంతుని ధ్యానించుకోవటం వలన నీకు ఎక్కువ విషయాలు తెలుస్తాయి. 1912 సం॥లో విరూపాక్ష గుహలో మొదట భగవాన్ పుట్టిన రోజు జరిగింది. మీ పుట్టిన రోజుచేసుకొంటాము అని భక్తులు భగవాన్‌ను అడిగితే ఈ శరీరం పుట్టినరోజు కాదు చేయవలసింది, ఈ శరీరము అనే తలంపు ఎక్కడపుడుతోంది అని దాని మూలాన్ని వెతకటం పుట్టిన రోజు యొక్క లక్ష్యం అన్నారు. నువ్వు 365 రోజులు విచారణ చేయటం మంచిదే. నువ్వు అలా చేయలేకపోతే కనీసం ఈ దేహం పుట్టినరోజున అయిన ఈ నేనుఅనే తలంపు ఎక్కడ పుట్టి వస్తోందో దానిని విచారణ చెయ్యి, ఇలా విచారణ చేయటమే నిజమైన పుట్టినరోజు అన్నారు.

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 29-12-2002, పూలపల్లి**

**20-01-2003**

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

నువ్వు జీవించిఉన్నంతకాలం నీవు చేయగలిగినంత మంచి చేస్తూఉండు. సత్పురుషులను చూసూఉంటే ఇదే వైకుంఠం అనిపిస్తుంది, కొంతమందికి ఆ వైభవాన్ని గ్రహించేశక్తిలేక ఇక్కడ ఉన్నదానిని వదిలేసి ఎక్కడో ఏదోచూస్తూ ఉంటారు. సత్వగుణం ఉన్నవారు ధన్యులు, వారు ఎక్కడికి వెళ్ళినా స్వతంత్రించుకొందురు అంటే వారు ఏదేశం వెళ్ళినా అది మనదేశమే అని వారికి అనిపిస్తుంది. అంటే మన దృష్టి అంత విశాలం అవ్వాలి. మన దృష్టి అంత విశాలమైతే అహంభావన పోతుంది. ఈ సృష్టిలో ఏదీ నాదికాదు అనుకోవటం జ్ఞానమార్గం, కనిపిస్తున్న జగత్తు అంతా నాది అనుకోవటం కర్మమార్గం. ధనం నీకు యజమానిగా ఉండకూడదు, ధనం నీకు బానిసగా ఉండాలి. ధనం నీకు యజమానిగా ఉంటే, ధనం మన మీద పెత్తనం చేస్తూఉంటే మనం మంచి పనులు చేయలేము, మన పతనం ప్రారంభమవుతుంది. ధనం మనకు బానిసగా ఉంటే మనం మంచి పనులు చేయగలము, మనం వినయంగా ఉంటాము, శాంత చిత్తముతో ఉంటాము. ధనం మనకు యజమానిగా ఉంటే అది పాపాన్ని తీసుకొని వస్తుంది. ధనం మనకు బానిసగా ఉంటే అది పుణ్యాన్ని తీసుకొని వస్తుంది. సూదిబెజ్జంలోనుండి ఒంటెను లాగగలము గాని ధనవంతుడిని స్వర్గంలోనికి పంపలేము అని బైబిలులో చెప్పాడు. ఎక్కడ ధనం ఉందో అక్కడ చెడువచ్చే అవకాశం ఉంది, అందువలన బహుజాగ్రత్తగా ఉండు అని భగవంతుడు చెప్పాడు. మనం సాధన చేసి సత్వగుణాన్ని సంపాదించుకోవాలి. సత్వగుణాన్ని సాధించలేకపోతే ఆత్మజ్ఞానసముపార్జనకు దారి కనబడదు, ఏపని చేసినా యజ్ఞభావంతో చేయాలి. చేతులతో పని చేయాలి, మనస్సుకు యజ్ఞభావం ఉండాలి. యజ్ఞభావనతో పనిచేసేవాడు పూర్ణస్థితిని పొందుతాడు. తిండిదగ్గర, నిద్ర దగ్గర అతిలేకుండా జాగ్రత్తగా ఉంటే అది శారీరకఆరోగ్యానికి మంచిది. మాటదగ్గర జాగ్రత్తగా ఉంటే అది మానసిక ఆరోగ్యానికి మంచిది. మనకు ఈ రెండు ఆరోగ్యాలు అవసరమే, ఇవి సరిగా లేకపోతే సత్యాన్వేషణ జరగదు. సత్యాన్వేషణ చేసే వారందరికి వెంటనే సత్యానుభవం కలుగకపోవచ్చు కాని అపజయం కూడా జయానికి దారితీస్తుంది. మనకు జిజ్ఞాస ఉంది, ప్రయత్నం చేస్తున్నాము, పడుతున్నాము మరల లేస్తున్నాము. కాలు జారిపడతాము అనుకోండి అలా

**రమణ భాస్కర**

కూర్చొని ఉండిపోతామా, మరల లేచి నడవటానికి ప్రయత్నం చేస్తాము. అలాగే జీవితంలోఅనేక అపజయాలు రావచ్చు. జయం సంపాదించటానికి అనుగుణంగా అపజయాలను మల్లించుకోవాలి. ఇది బాగా గుర్తు పెట్టుకోండి. అందుచేత మీరు చేసిన సాధన ఊరికేపోదు, ఈ జన్మలో ఆత్మసాక్షాత్కారం పొందకపోయినా మీరు చేసిన సాధన రాబోయే జన్మలో కంటిన్యూ అవుతుంది. ఇతరులకు మీరు ఏదైనా సహాయసహకారములు అందిస్తే అవి తిరిగి మీకే వస్తాయి అన్న సంగతి మీకు తెలిస్తే ఇతరులకు చేయకుండా ఎలా ఉండగలరు. నీవు కర్మఫలాన్ని ఆశించకుండా ఉంటే నీకు వికారమే లేదు అని భగవంతుడు చెపుతున్నాడు. చేసే స్నేహాల విషయంలో, చదివే గ్రంధాల విషయంలో అజాగ్రత్త పనికిరాదు. సజ్జనసాంగత్యం వలన మనకు వైరాగ్యం కలుగుతుంది, అభ్యాసం చేయాలి, గమ్యానికి చేరుకోవాలి అనే తపన కలుగుతుంది, అభ్యాసం, వైరాగ్యం ఈ రెండూ విడిచిపెట్టవద్దు అని భగవంతుడు చెపుతున్నాడు. మనం సమాజానికి ఎంతవరకు ఉపయోగపడగలమో అంతవరకు కర్తలేని కర్మను చెయ్యాలి. కర్తృత్వం లేకుండా, నిర్మలమైన మనస్సుతో, నిగ్రహంగా పనిచేయాలి. నిగ్రహం తక్కువ ఉన్నవాడికి ఆగ్రహం ఎక్కువ ఉంటుంది. హెచ్చు తగ్గులు లేకుండా ఎవరి జీవితం ఉండదు. జయాన్ని, అపజయాన్ని సమానంగా తీసుకో అని

**జ్ఞానమంటే సత్యాన్ని అనుభూతం చేసుకోడమే. అది ధ్యానం వలననే సాధ్యమవుతుంది. ఇతర భావాలన్నింటినీ వర్జించి సత్యాన్ని అనుభూతం చేసుకోడానికి తోడ్పడుతుంది ధ్యానం.**

**- భగవాన్ శ్రీ రమణమహర్షి**



భగవంతుడు చెపుతున్నాడు, సమానంగా తీసుకొనే శక్తి నీకు లేకపోతే దానిని సంపాదించుకోవాలి. వాటిని సమానంగా తీసుకొనే శక్తి నీకు లేకపోతే మనస్సుకు లోచూపు కలుగదు.

మనం నేను, నేను అంటున్నాము. మనకు దేహం తెలుస్తోంది. దేహంనేను అని అనదు. లోపల చైతన్యం ఉంది, వారు ఏమీ అనరు. మరి నేను, నేను అని ఎవరు అంటున్నారు మనం ఏదైతే నేను, నేను అంటున్నామో అది ఒక తలంపు. అది నీకు బయటనుండి రావటం లేదు, లోపల నుండే వస్తోంది. నీకు గాఢనిద్రలో ఉండగా నేను అనే తలంపు లేదు. జాగ్రదవస్థలో ఉండగా నేను అనే తలంపు వస్తోంది. కాని జాగ్రదవస్థలోను, గాఢనిద్రలోను కూడా నీవు ఉన్నావు. జాగ్రదవస్థలోను, గాఢనిద్రలోను ఉన్న నువ్వు నిజమా? లేక జాగ్రదవస్థలో ఉండిగాఢనిద్రలో పత్తాలేకుండా పోయే ఆ నేను నిజమా? నేను అనేది

**మోక్షమనగా నీవు పుట్టనివాడివని తెలుసుకోడమే, నిశ్చలత్వము పొంది, 'నేనే బ్రహ్మము' నని తెలుసుకో. నిశ్చలత్వము పొందడమంటే మనోభావనలేవీ లేకుండా ఉండడం. కావలసినది 'తెలుసుకోడం' గాని 'భావించడం' కాదు.**

**- భగవాన్ శ్రీ రమణమహర్షి**

ఒక తలంపు మాత్రమే, అది నిజం కాదు. నీకు ఎన్నితలంపులు వచ్చినా నేను అనే తలంపుకే వస్తున్నాయి. జగత్తు, జీవుడు, ఈశ్వరుడు ఇవి అన్నీ నేను అనే తలంపు కల్పితములే. నేను అనే తలంపు ఎంతనిజమో అది కల్పించే విషయాలు కూడా అంతేనిజం. మన గుణాలు వేరు, రంగులు వేరు, వృత్తులు వేరు. ఈ తేడాలు, తంటాలు అన్నీ తీసుకొని వచ్చేది నేను అనే మూలతలంపు. ఆ మూలతలంపును శోధించు. ఆ మూలతలంపు మూలాన్ని సాధించు ఇదే రమణసందేశం. నువ్వు ఈ మూలతలంపును మినహాయించి సాధన చేస్తున్నావు. అలాకాదు నీ సాధనలో ఆ మూలతలంపును ఇన్‌వాల్వ్ చెయ్యి. ఏది వచ్చిన తరువాత మిగతావి అన్నీ వస్తున్నాయో ఆ మూలతలంపు అనే సమస్యను నీవు పరిష్కారం చేసుకోవటం లేదు. నువ్వు భక్తిమార్గంలోగాని, కర్మమార్గంలోగాని, ధ్యానమార్గంలోగాని ఏదో ఒక మార్గంలో ప్రయాణించి ఈ సమస్యను పరిష్కారం చేసుకో. నీకు ఎన్నితలంపులు వచ్చినా కంగారుపడవద్దు. ఇవి అన్నీ నేను అనే తలంపుకే వస్తున్నాయి. అది ఎక్కడనుండి వస్తోంది, ఇది మీరు అర్థం చేసుకోండి. ఎక్కడయితే భగవంతుడు ఉన్నాడో అక్కడ నుండే ఈ తలంపు వస్తోంది. ఈ మూలతలంపును పట్టుకొని, దానిని శోధించి దాని మూలంలోనికి వెడితే ఈ మూలతలంపు అదృశ్యమవుతుంది, మూలతలంపు మూలంలో ఉన్న బ్రహ్మం నీకు తానుగా వ్యక్తమవుతుంది. ఆత్మవిచారణ కాలక్షేపం కోసంకాదు, ఆత్మసాక్షాత్కారం కోసం. ఆత్మనుదర్శించటం అంటే కళ్ళతో చూడటం కాదు, ఆత్మగా ఉండటం. ఇప్పుడు మీరు శరీరంగాను, మనస్సుగాను ఎలా ఉంటున్నారో అలాగ ఆత్మగా ఉండాలి. ఆత్మ ఎలా ఉంటుంది? అది శాంతిగా ఉంటుంది. ఆనందంగా ఉంటుంది, సౌందర్యంగా ఉంటుంది, సరళంగా ఉంటుంది దేహం ఉండటం పోవటంతో దానికి పనిలేదు, అది సహజంగా ఉంటుంది. ఆ స్థితికి నీవు వెళ్ళాలి, అదే నీ జీవితగమ్యం. ఇప్పుడు నీకు మూలతలంపు తెలుస్తోంది. అది ఎక్కడకు వెళ్ళినా తంటాలు తెచ్చిపెడుతుంది. నీవు ఏదో మార్గంలో ప్రయాణించి మూలతలంపును దానిమూలంలోనికి పంపు. హృదయంయొక్క లోయల లోనికి నీవువెళ్ళగలిగితే అంత వైరాగ్యం నీకు ఉంటే, అంత అభ్యాసం నీకు ఉంటే, అంత లోతులలోనికి దిగేశక్తి నీకు ఉంటే మూలతలంపు మూలం నీకు తెలుస్తుంది. మనస్సును ఎలా నిగ్రహించుకోవాలి అని అడిగితే అసలు మనస్సు ఉందో, లేదో ముందు నువ్వు చూసుకో. మనస్సు లేకపోతే నిగ్రహించుకోవలసిన పనిలేదు, మనస్సు ఉంది అనుకో అప్పడు నిగ్రహించుకోవటానికి ప్రయత్నించు. దేహంతో తాదాప్యంపొందే తలంపే మనస్సు దానిని



తీసి ఒక ప్రక్కన పెట్టు ఇంక మనస్సు అంటూ ఏమీలేదు. నీ హృదయంలో ఒక నిజం ఉంది. అక్కడకు తీసుకొని వెళ్ళటానికి మహర్షి ప్రయత్నం చేస్తున్నారు. మీరు నిజంకాని దానిని నిజం అని నమ్ముతున్నారు. ఇలా అనేక జన్మలు వెళ్ళిపోతున్నాయి. తరువాత ఇది నిజంకాదు అని తెలుసుకొని మరల ప్రయాణం మొదలుపెట్టాలి. మీరు కాలాన్ని పాడుచేసుకోవద్దు, శ్రమను విడిచిపెట్టవద్దు. భౌతికంగాగాని, ఆధ్యాత్మికంగాగాని శ్రమే ఫలితాన్ని తీసుకొని వస్తుంది. పనిని విడిచిపెట్టవద్దు. పని విడిచిపెడితే సోమరితనం వస్తుంది గాని జ్ఞానం రాదు. ఈసృష్టిలో రెండు రకాల మనుషులు ఉన్నారని రామకృష్ణ పరమహంస చెప్పారు. కొంతమంది చేటలు, కొంతమంది జల్లెడలు అన్నారు. చేట చెడ్డను వదిలేస్తుంది, మంచిని పట్టుకొంటుంది. సాధకుడు చేటలా ఉండాలి కాని జల్లెడలా ఉండకూడదు. జల్లెడ మంచిని వదిలేసి చెడ్డను దగ్గరపెట్టుకొంటుంది. మీకు జ్ఞానం కావాలంటే చేటలా ఉండాలి.

మనం ఒంటరిగా ఉన్నప్పడు ఒకరకంగా ఉంటాము, పది మందితో ఉన్నప్పడు ఒక రకంగా ఉంటాము. అంటే మనది సహజస్థితి కాదు. మనం పూజగదిలో ఉన్నప్పడు ఎలా ఉంటున్నామో వందమందిలో ఉన్నప్పడు కూడా అలా ఉండగలగాలి. అలా ఉండలేకపోతే అజ్ఞానం అక్కడ పనిచేస్తోంది అని గుర్తు. ఏదో కొద్దిసేపు పూజ చేసుకొని బయటకు వచ్చారు అనుకోండి. మిమ్మల్ని ఎవరైనా పొగిడితే సంతోషం, ఎవరైనా విమర్శిస్తే దుఃఖం వస్తోంది అనుకోండి మీరు చేసిన పూజ ఎక్కడకు వెళ్ళిపోయింది. పూజ చేయటం ద్వారా మీరు ఏమి సాధిస్తున్నారు అంటున్నాను. ఆ పూజ చేసే నేనును, జపం చేసే నేనును, ధ్యానంచేసే నేనును ఎప్పడైనా పరిశీలించారా? దానిని ఎప్పడైనా శోధించారా? మూలతలంపు మూలంలోనికి వెళ్ళటం నేర్చుకొన్నారా? పోనీ ఆ మార్గంలో మీరు తరించకపోయినా జ్ఞానమార్గంలో ప్రయాణం చేయాలనే స్థిరత్వం, ధృడనిశ్చయం మీలో ఎవరికైనా ఉందా? అసలు ఆ ఎనాలసిస్ మీకు లేదు. మీరు ఏ మార్గంలో ప్రయాణం చేసినా దేహబుద్ధిలోనుండి విడుదలపొందాలి. దేహబుద్ధిలోనుండి విడుదల పొందకపోతే అజ్ఞానం, దుఃఖం, అశాంతి మిమ్మలను వెంటాడుతుంది. సోదర మహాశయులారా! ఒకటి గుర్తు పెట్టుకోండి. మీరు మూలతలంపు మూలంలోనికి వెళ్ళలేదు అనుకోండి, దుఃఖం తాలుక దుంప ఎండిపోదు, నశించదు. అది అలాగే ఉండిపోతుంది. మూలతలంపు మూలంలోనికి వెళితేగాని దుఃఖం తాలుక దుంప ఎండదు, నశించదు. ఆ దుంప పచ్చగా

ఉన్నంతకాలం నీవు ఎన్ని జన్మలు ఎత్తినా జన్మజన్మలకు దుఃఖం, అశాంతి నిన్ను వెంటాడుతుంది, ఆందోళన నిన్ను వెంటాడుతుంది, నీవు శవాలను మోస్తూ ఉండవలసిందే. లోపల దు:ఖం తాలుక దుంప పెట్టుకొని ఏదో జపం చేసి, పూజ చేసి తాత్కాలికంగా పది నిముషాలు శాంతిగా ఉంటే సమాధిస్థితికి జానెడు దూరంలో ఉన్నామని, ఆత్మజ్ఞానానికి జానెడు దూరంలో ఉన్నామని ఎంతకాలం మనలను మనం మోసం చేసుకొంటాము. నేను అనే మూలతలంపు చైతన్యసాగరంలో నుండి వచ్చిన ఒక బుడగ వంటిది. బుడగ పగిలిపోతే సముద్రంలో కలిసిపోతుంది. అలాగే నేను అనే తలంపు పోతే నీవు పోవు, నీవు ఏదిగా ఉన్నావో అది అవుతావు, జ్ఞానమే నాకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. మూలతలంపు మూలంలో నీవు ఐక్యమైనప్పుడు, ఆ ఆనందసాగరంలోనీవు ఈదులాడుతున్నప్పుడు నీ హృదయంలో ఉన్న శాంతి, ఆనందం ఒక్కసారి పొంగి నీ సహస్రారాన్ని ముంచేస్తుంది. అప్పుడు నీకు ఎటుచూసినా ఆనందమే, ఎటుచూసినా శాంతే. అద్వైతసంస్కారం కలగటానికి ఎన్నోజన్మల పుణ్యబలం నీకు ఉండాలి. ద్వైతం కూడా మంచిదే. ద్వైతం అద్వైతానికి దారి చూపిస్తుంది. విగ్రహం మంచిదే ఎంతవరకు అంటే నీకు నిగ్రహం తీసుకొని వచ్చే వరకు విగ్రహం మంచిదే. విగ్రహారాధన వలన మీకు కామక్రోధములు తగ్గుతూ ఉంటే విగ్రహారాధన మంచిదే. కాని అసలు సమస్య పరిష్కారం కాదు. మూలతలంపును వదిలేసి నీవు ఎన్నిసాధనలు చేసినా తాత్కాలికంగా నీకు శాంతిగా ఉండవచ్చు గాని గమ్యాన్ని చేరలేవు. నీ మనస్సుతో విరోధం పెట్టుకోవద్దు, మనస్సును స్నేహితునిగా చేసుకొని మనస్సుతో అనుకూలంగా ఉండి, దానిని మచ్చిక చేసుకొని మనోమూలంలోనికి వెళ్ళు అని భగవంతుడు చెపుతున్నాడు. ఇప్పుడు మనం చైతన్యంలోనే ఉన్నాము. మరి చైతన్యంలో ఉంటే సుఖంగా, శాంతిగా ఎందుకు ఉండలేక పోతున్నాము? మనం చైతన్యంలోనే ఉన్నాము అన్న సంగతి మనకు తెలియటం లేదు అందుచేత దుఃఖం మనలను వెంటాడుతోంది. ఇది తెలుసుకుంటే సుఖం, తెలియకపోతే దుఃఖం.

ఇప్పుడు మీకు ఏదో ఒక తలంపు వస్తుంది, వెంటనే దుఃఖం వస్తుంది. మరల ఇంకో తలంపు వస్తుంది, సంతోషం వస్తుంది. జీవితంలో మీకు అనుకూలపరిస్థితులు ఉంటాయి, ప్రతికూలపరిస్థితులు ఉంటాయి. ఈ పరిస్థితులు అన్నీ చక్కబెట్టుకొన్నాక సాధన చేద్దామనుకోవద్దు. పరిస్థితుల మధ్యలోనే మనం సాధన చేసుకొంటూ వెళ్ళాలి,



సమస్యలమధ్యలోనే మనం సాధన చేసుకొంటూ వెళ్ళాలి. సముద్రంలో కెరటాలు తగ్గాక స్నానం చేద్దాము అనుకోవటం ఎటువంటిదో సమస్యలు అన్నీ చక్కబెట్టుకొన్నాక సాధన చేద్దామనుకోవటం అటువంటిదే అని స్వామీజీ చెప్పారు. కెరటం కెరటం మధ్యన స్నానంచేసి నీవు ఒడ్డుకురా అలాగే సమస్యకు సమస్యకు మధ్యసాధనచేసి మూలతలంపు మూలంలోనికి వెళ్ళు అంతేగాని సాధన విడిచిపెట్టవద్దు. నేను ఎవడను అని ప్రశ్నించుకొంటున్నాను కాని అర్థం తెలియటంలేదు అని అడుగుతున్నాడు. నువ్వు నేను, నేను అంటున్నావు కదా. ఆ నేను అనేది నిజం కాదు. అది ఒక తలంపు. నీకు చాలా తలంపులు వస్తున్నాయి కదా కాని నేను అనేది మొదటి తలంపు. ఇది వచ్చాక నీకు ఇతర తలంపులు వస్తున్నాయి. ఈ మొదటితలంపు లేకపోతే నీకు ఇతరతలంపులు రావు. నేను ఎవడను అని ఎవరిని అడుగుతున్నాము? మూలతలంపును నీవు ఎవడవు అని అడుగుతున్నాము. ఈ ప్రశ్న వలన మూలతలంపు ఉపసంహరింపబడి, ఉపసంహరింపబడి దాని మూలంలోనికి వెళుతుంది. మూలతలంపును దాని మూలంలో ఉంచటం వలన అది నశిస్తుంది. అంటే మనకు సైతాను తాలుక పీడ వదలిపోతుంది. మీకు ఎటువంటి తలంపులు వచ్చినా ఆతలంపులను రావద్దు అనకండి, అలా అనుకుంటే ఇంకా ఎక్కువగా వస్తాయి. గదిలోనికి వెళ్ళి దేవుడి బొమ్మ వంక చూసి నమస్కారం పెట్టుకొని నాకు ఇటువంటి తలంపులు వస్తున్నాయి అంటే కొద్దిసేపు ఆ తలంపులు ఆగుతాయి కాని మరల నీవు బయటకు వచ్చాక ఆ తలంపులు అన్నీ ముసిరేస్తాయి. నీవు దేవుడా, దేవుడా అంటున్నావు అది కూడా నీ మూలతలంపు కల్పితమే. గాఢనిద్రలో నీకు మూలతలంపు లేదు, అక్కడ దేవుడి స్మరణ కూడా లేదు. ఇక్కడ భగవాన్ ఏమి చేస్తున్నారు అంటే మధ్యవర్తులతో సంబంధం లేకుండా నీ హృదయంలో ఉన్న శాంతిసాగరంలో, ఆనంద సముద్రంలో నిన్ను ముంచటానికి ప్రయత్నం చేస్తున్నారు, ఆనిర్వాణస్థితిని కౌగిలించుకోవటానికి ఇది ఒక ప్రయత్నం. మిమ్మల్ని ఎవరైనా పొగడుతారు అనుకోండి పొగడనీయండి. ఎవరైనా విమర్శిస్తున్నారు అనుకోండి, విమర్శ చేయనీయండి. ఇవి అన్నీ తలంపులే. మీకు ఎన్ని తలంపులు వచ్చినా రానివ్వండి, రండి రండి అని ఆహ్వానించండి. ఎంత గడ్డిమేటు లాంటి కర్మ అయినా విచారణ అనే అగ్గిపుల్ల ముందు అంతా కాలి బూడిద అవుతుంది. మీకు ఎన్ని తలంపులు వచ్చినా ఈ తలంపులు అన్నీ ఎవరికి వస్తున్నాయి అంటే నేనుకు వస్తున్నాయి. ఆ నేనును నువ్వు ఎవరు? ఎక్కడ నుండి వస్తున్నావు? అని ప్రశ్నించటం మొదలుపెడితే అది నెమ్మది నెమ్మదిగా లోపలకు

జరిగి దాని మూలంలోనికి వెళ్ళి అది నశిస్తుంది. మీరు చెప్పేది శాస్త్రీయంగా చెప్పండి అని అడిగితే భగవాన్ ఏమంటున్నారు అంటే ఏది సైన్స్. చీకటిలోనుండి వెలుగులోనికి రావటం, అజ్ఞానం లోనుండి జ్ఞానం లోనికి రావటం, దుఃఖంలో నుండి సుఖంలోనికి రావటం ఇది సైన్సు కాకపోతే ఏది సైన్సు. నువ్వు చావటానికి సిద్ధంగా ఉంటే చావులేనిస్థితికి మేల్కొలుపుతూ ఉంటే అది సైన్సు కాదా! చైతన్యం ఒక్కటే సత్యం. మిగతావి అన్నీ అందులో కల్పించబడ్డాయి. నీకు మూలతలంపు ఉంటే ఈ ప్రపంచం ఉంది, దుఃఖం ఉంది, సంతోషం ఉంది, ఇష్టం ఉంది, అయిష్టం ఉంది అన్నీ ఉన్నాయి. ఈ మూలతలంపు ఎంతనిజమో అవి అన్నీ కూడా అంతే నిజం. ఈ మూలతలంపు మీదే ఖగోళం అంతా ఆధారపడి ఉంది. ఆ మూలతలంపును షేక్ చేసి, దానిని దాని మూలంలోనికి పంపించు అప్పుడు అది నశిస్తుంది. అప్పుడు ఉన్నదంతా నువ్వే.

లోపల ఏదో ఉంది దానిని తెలుసుకోవాలి అని మనం అనుకొంటున్నాము. కొంతమందికి తెలుసుకోవాలనే కాంక్ష ఉండదు. వారికి పుస్తకంతో పనిలేదు. పూర్తిగా తెలుసుకొన్నవాడికి పుస్తకం అక్కరలేదు. ఎవరికి కావాలంటే జ్ఞానసముపార్జన చేసే వారికి అంటే సాధకులకు గ్రంధం కావాలి. నా జీవితానుభవం ఏమిటి అంటే అన్నింటికంటే సజ్జనసాంగత్యం గొప్పది. లౌకికులకు ఎంతదూరంగా ఉంటే అంతమంచిది. లౌకికులతో స్నేహం చేయటం మానకపోతే వారి గుణాలు మనకు వచ్చేస్తాయి. మనం సాధనచేస్తూ లౌకికులతో స్నేహం మానకపోతే మనం ఒక మైలు ముందుకు ప్రయాణం చేసి, మరల 4 మైళ్ళు వెనుకకు వెళుతూ ఉంటాము. అంటే మనం ముందుకు వెళుతున్నామా? వెనుకకు వెళుతున్నామా? మనం ఎంత సాధన చేసినా లౌకికులతో సహవాసం చేస్తూ ఉంటే వారు మనలను పతనం చేస్తారు. మీరు అందరూనాకు అనుచరులు అనుకోండి, మాటవరసకి మీరు అందరు ఒకేసారి నన్ను విడిచిపెట్టేస్తారు అనుకోండి. అప్పుడు నా మనస్సు కదిలింది అనుకోండి నాకు జ్ఞానం లేనట్లు గుర్తు. ఒకటి జ్ఞాపకం పెట్టుకోండి మనం చనిపోయినప్పడు ఒంటరిగా ప్రయాణం చేయాలి. అప్పడు స్నేహితులు, బంధువులు ఎవరూ రారు. ఈ భూమి మీదకు ఒంటరిగా వచ్చాము, మరల ఈ భూమిని విడిచిపెట్టేటప్పడు ఒంటరిగా వెడతాము. మోక్షం కోసం మీరు శరీరం పోయేదాక ఆగనక్కరలేదు, సైతానును మనం ప్రక్కకు తప్పించగలిగితే ఇప్పడే మోక్షం పొందవచ్చు. నీకు దేహంతోటి, గౌరవాలతోటి, అగౌరవాలతోటి, ఇంద్రియాలతోటి తాదాప్యం వస్తోంది అనుకో ఆ తాదాప్యం పొందే వారు ఎవరు? నీ లోపల ఉన్న చైతన్యం కాదు, ఈ దొంగనేనే దేహంతో తాదాప్యం పొందుతోంది. నువ్వు ఏదైతే కాదో అదే నువ్వు అని అనిపింపచేసేది ఈ దొంగనేనే. నిజమైననేనుకు ఇటువంటి గొడవలు అక్కరలేదు, వారు ఉంటారు అంతే. సత్పురుషుడు కానివాడికి అన్ని గొడవలు కావాలి కాని సత్పురుషుడికి ఏమీ అక్కరలేదు. వారు ఉంటారు. వారుఅలాగ ఉండరు, ఇలాగ ఉండరు. నిజమైన నాన్నగారు బయటలేరు, మీలోపలే ఉన్నారు. నీకు గైడెన్స్ లోపలనుండే వస్తుంది. నీ ఆలోచనలో ఎక్కడైనా పొరపాట్లు ఉంటే ఈ పొరపాటు ఉంది, ఇందులోనుండి విడుదలపొందాలి అని నీకు లోపలనుండే గైడెన్స్ వస్తుంది. ఒకసారి రాజాజీ దగ్గర ఎవరో రాముడిని విమర్శిస్తూ మాట్లాడతారు. ఆ విమర్శించేవాడితో రాజాజీ ఏమన్నారు అంటే మనం చిన్నప్పుడు తల్లి పాలుతాగాము. తల్లి పాలు డాక్టరు దగ్గరకు తీసుకొనివెళ్ళి ఇవి మా అమ్మపాలు ఇవి మంచివా, చెడ్డవా అని అడగటం ఎటువంటిదో నీవు రాముడిని విమర్శించటం కూడా అటువంటిదే అన్నారు. ఎవరి నామం స్మరించుకోవటం వలన మనకు మోక్షం వస్తుందో ఆ రాముడు నామం స్మరించుకోవటం మానివేసి, రాముడిని విమర్శిస్తున్నావా? ఇదేనా నీవు నేర్చుకొన్న విద్య అన్నారు.

# సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 26-01-2003 | ఆదివారం | జిన్నూరు శ్రీరమణక్షేత్రం |
| 30-01-2003 | గురువారం | గుండుగొలను |
| 08-02-2003 | శనివారం | చించినాడ గీతా మందిరం |
| 19-02-2003 | బుధవారం | గణపవరం సాయిబాబా మందిరం |



**అమలాపురం క్షత్రియ కళ్యాణ మండపం కమిటీ సభ్యులతో సద్గురు శ్రీ నాన్నగారు**

**రమణ భాస్కర చందాదారులకు విజ్ఞప్తి**

రమణ భాస్కర పత్రిక అందనియెడల మొదట మీ పోస్ట్ ఆఫీసులో ఒక్కసారి ఎంక్వైరీ చేయండి. తరువాత మీ అడ్రసు (డోర్ నెంబరు, వీధి, పిన్‌కోడ్), మీ చందా రశీదు నెంబరు తెలియజేస్తూ తదుపరి సంచికలోపు ఎడిటర్, రమణభాస్కర, జిన్నూరు - 234 265కు పోస్టుకార్డు ద్వారా తెలియజేయండి





**అమలాపురం క్షత్రియ కళ్యాణ మండపం ప్రాంగణంలో సద్గురు శ్రీ నాన్నగారు**

తూర్పుగోదావరి జిల్లా అమలాపురం పట్టణంలో క్షత్రియ కళ్యాణ మండపం ఒక కోటి రూపాయల వ్యయంతో నిర్మాణము జరుగుచున్నది ది॥ 7-1-2003 మంగళవారం సద్గురు శ్రీ నాన్నగారు అమలాపురం కళ్యాణ మండప ప్రాంగణమును సందర్శించి రు. 50,000 రూపాయల విరాళము ప్రకటించినారు.

భవిష్యత్తులో ఈ కళ్యాణమండప కార్యవర్గ సభ్యులు అందాలసీమ అయిన కోనసీమ ప్రాంతంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించుటకు ప్రయత్నించుచున్నారు. ఈ కళ్యాణ మండపమునకు ఎంతో ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని శ్రీ నాన్నగారు అన్నారు.